క్లుప్తంగా

18న డయల్ యువర్ డీఎం

మదనపల్లె సిటీ: ఆర్టీసీ పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18వ తేదీన ఆర్టీసీ -1, 2 డిపో పరిధిలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రయాణికులు తమ సమస్యలను ఫోన్ ద్వారా తెలియజేయవచ్చునన్నారు. 9959225676ను సంప్రదించాలని కోరారు.

18న మండల మీట్

కురబలకోట: ఈనెల 18న ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. సభ్యులతో పాటు వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

నేడు కలకడలో..

కలకడ : మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్ రహీం తెలిపారు. ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో మండల అభివృద్ధి, సమస్యలను చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు విధిగా హాజరుకావాలని కోరారు.

ప్రమాదంలో గాయపడిన విద్యార్థికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు : విద్యుత్ ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థికి మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి రూ. లక్ష విరాళం అందజేశారు. బాలంవారిపల్లె పంచాయతీ తూగుంటపల్లెకు చెందిన కృష్ణయ్య కుమారుడు దేవేంద్ర (22) ఇంజినీరింగ్ విద్యార్థి. అతడు ఇటీవల విద్యుత్ ప్రమాదంలో చేతులు, కాలు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి మంగళవారం తూగుంటపల్లెకు చేరుకుని బాధితున్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

శ్మశానవాటిక ఆక్రమణపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

మదనపల్లె : మున్సిపాలిటీలోని 3వవార్డు గౌతమీనగర్ శ్మశానవాటికకు సంబంధించిన స్థలాన్ని కొందరు వ్యక్తులు జేసీబీతో చదును చేసి పునాదులు వేసుకుంటున్నారని స్థానికులు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం సాయంత్రం సబ్ కలెక్టరేట్‌ను కలిసి శ్మశానవాటిక స్థల ఆక్రమణలపై వివరించారు. 1990లో గౌతమీనగర్‌లో సర్వేనెం.410/38లో శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించారన్నారు. అప్పటి నుంచి స్థానికులు అక్కడే ఖననం చేస్తూ, దహన సంస్కారాలు నిర్వహిస్తున్నామన్నారు. అయితే రెవెన్యూ అధికారులు శ్మశానవాటికకు స్థల హద్దులు చూపనందున కొంతమంది రాత్రికి రాత్రి ఆక్రమణ చేసేందుకు జేసీబీతో గుంతలు తవ్వి చదును చేస్తున్నారన్నారు. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు రెవెన్యూ అధికారులకు అర్జీ ఇచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రెవెన్యూ అధికారులు శ్మశానవాటిక హద్దులు చూపించి, ప్రహరీగోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సుధాకర, మల్లికార్జున,రామాంజులు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయడమే లక్ష్యం



ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పీలేరు : ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీలను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికారి ప్రతినిధి దుడ్డు రామకృష్ణ అన్నారు. మంగళవారం పీలేరులో ఎంఎస్‌పీ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ప్రచార రథం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నూతన గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మాదిగల సమస్యలు పరిష్కరించుకోవడానికి కమిటీలను బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రమాదిగ, టీడీపీ నాయకులు రామ్మూర్తి, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

పెద్దమండ్యం: గ్రామాల అభివృద్ధిలో వార్డు మెంబర్లు భాగస్వాములు కావాలని పెద్దమండ్యం ఎంపీడీఓ శ్రీధర్‌రావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం వార్డు మెంబర్లకు ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో వార్డు మెంబర్లు భాగస్వామ్యులు కావాలన్నారు. పంచాయతీ కేంద్రంలో నిర్వహించే గ్రామసభలకు హాజరై పల్లెల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించాలన్నారు. అనంతరం పంచాయతీ రాజ్ చట్టంపై వార్డు మెంబర్లకు శిక్షణ ఇచ్చారు.

నీరులేక చెరువులు వెలవెల



గుట్టపాళెం గ్రామంలో పూర్తిగా అడుగంటిన నల్లపచెరువు



చుక్క నీరు లేక ఖాళీగా ఉన్న భయ్యపురెడ్డిచెరువు

- ఎకరం కూడా సాగులోని ఆయకట్టు భూములు
- మూగజీవాలకూ నీరు కరువైంది
- ఆందోళనలో రైతులు

కలికిరి: మండల పరిధిలోని చెరువులు చుక్క నీరు లేకుండా దర్శనమిస్తుండటం రైతుల్లో ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. మండలంలోని చిన్న, మధ్య తరహా చెరువులు 180 ఉన్నాయి. ఈ చెరువుల కింద సుమారు 2వేల ఎకరాలు సాగుభూములున్నాయి. చెరువులు పూర్తిగా అడుగంటి పోవడంతో చెరువుల ఆయకట్టు భూములు బీడుగా మారాయి. కలికిరి మండల కేంద్రం సదుం రోడ్డులో గల కలికిరి పెద్దచెరువులో మాత్రమే కొంతమేర నీరు ఉండి కలికిరి పట్టణానికి తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండటం కొంత ఊరటనిస్తోంది. అటవీప్రాంతాలకు సమీపంలో గల చిన్నపాటి కుంటలలో సైతం నీరు అడుగంటి పోవడంతో మూగజీవాలకు సైతం నీరు కరువైంది. పశువులు, మేకలు, గొర్రెలు వంటి జీవాల తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు.

ఊరిస్తున్న వర్షం...

వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు నిండుకోవాలని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. చిన్నపాటి వర్షం తప్ప చెరువులకు నీరు చేరే వర్షం రావడంలేదు. అయితే వర్షం ఊరిస్తోంది తప్ప కనీసం వాగులు, వంకలు సాగడం లేదు. దీంతో రైతులకు నిరాశ తప్పడం లేదు. ఇలాగే వర్షాలు కురవక పోతే వ్యవసాయం ప్రశ్నార్థకమనే అంటున్నారు. ఇప్పటికే మండల పరిధిలో వ్యవసాయ బోర్లు అడుగంటి పోయాయి. సుమారు 1100 నుంచి 1300 అడుగుల లోతు వరకు బోర్లు తవ్వినా నీరు లభించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షలాది రూపాయలు భూమిలో పోసి నష్టిననని ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. వర్షాధారంతో సాగు చేసిన వేరుశనగ పంట దెబ్బతినడంతో రైతులకు పెట్టుబడికి చేతికందని స్థితి నెలకొంది.

వేరుశనగ పంట నేలపాలైంది...



రెండు ఎకరాలు విస్తీర్ణములో వేరుశనగ పంట సాగు చేశాను. వర్షాలు కురవక పోవడంతో పంట చేతికందలేదు. వర్షాభావంతో వేరుశనగ ఎండిపోయింది. కష్టంతో పాటు విత్తనాలు, పంట సాగు పెట్టుబడి కూడా నేలపాలైంది. వర్షాధార పంట సాగు చేయాలంటేనే భయమేస్తోంది.

- వంబాల రెడ్డెయ్య, గాజులబండకురవపల్లి, కలికిరి

వర్షాలు లేకుంటే రైతులకు కష్టాలు తప్పవు



వర్షాలు సకాలంలో పడకుంటే రైతులకు కష్టాలు వర్ణనాతీతం. ఈ ఏడాది ఇప్పటి వరకు చెప్పుకోదగ్గ వర్షపాతం లేదు. ఎక్కడా చెరువులు, కుంటల్లో చుక్కనీరు లేదు. వ్యవసాయ బోర్లు అడుగంటుతున్నాయి. ఇలాగే కొనసాగితే సాగునీరుతో పాటు తాగునీటికి కష్టాలు తప్పవు.

- పసల భాస్కర్ రెడ్డి, తొగటపల్లి, కలికిరి

మండలాన్ని కలసికట్టుగా అభివృద్ధి చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి

పీలేరు : మండలాన్ని కలసికట్టుగా పని చేసి అభివృద్ధి చేద్దామని ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాయలంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 85 లక్షలతో 26 సిమెంట్ రోడ్లు మంజూరైనట్లు తెలిపారు. వర్షానికి కల్వర్లు, రోడ్లు, కాలువలు ఎక్కడైనా దెబ్బతింటే తక్షణం సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నీటి సౌకర్యం కల్పించడానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా నీటి సమస్య తలెత్తితే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. గృహనిర్మాణ శాఖ ఏఈ రమణయ్య మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు మార్చి లోపు పూర్తి చేసిన ఇళ్లకే బిల్లులు అందుతాయన్నారు. లబ్ధిదారులకు సిబ్బంది అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శివశంకర్, పీఆర్ డీఈ మధుసూధన్, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా పట్టాభిరాముడి పవిత్రోత్సవాలు



పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్న వేదపండితులు



చక్రస్నానం చేయిస్తున్న వేదపండితులు

వాల్మీకిపురం: టీటీడీ ఆధ్వర్యంలో వాల్మీకిపురం శ్రీ పట్టాభిరాముడి వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం పవిత్రాలు ప్రతిష్ఠ కార్యక్రమం కనుల పండువగా సాగింది. ఉదయం సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవ, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్నపన తిరుమంజనం, హోమాలు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు క్రిష్ణప్రసాద్ భట్టార్, క్రిష్ణంరాజుబట్టర్, బాషికాచార్యులు, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.

- పవిత్రోత్సవాల్లో నేడు

పవిత్రోత్సవాల్లో బుధవారం యాగశాల వైదిక కైంకర్యములు, పవిత్ర సమర్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టండి



మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీవైఎస్ అధ్యక్షుడు పునీత్

మదనపల్లె : పట్టణంలో వైద్యం పేరుతో ప్రజలను నిలువుదోపిడీకి గురిచేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆస్పత్రిలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు బహుజనయువసేన అధ్యక్షులు పునీత్ విన్నవించారు. మంగళవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి మదనపల్లెలో వైద్యసేవలకు సంబంధించి ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై వివరించారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ...ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో పలు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయన్నారు. వీటిపై పలుమార్లు బీవైఎస్ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినా ఏమాత్రం చర్యలు తీసుకోలేదన్నారు. మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చిన్నపాటి అత్యవసర కేసులకు సైతం వైద్యం అందించలేక, తిరుపతికి రెఫర్ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జిలానిబాషా, నాగరాజు, కన్నెమడుగులక్ష్మినారాయణ పాల్గొన్నారు.

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి



రామసముద్రం: చెల్లచెరువును పరిశీలిస్తున్న ఎంపీడీఓ భానుప్రసాద్

కలికిరి: ప్రస్తుతం కురుస్తున్న తుపానుపై అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిని ఎంపీడీఓ భానుమూర్తి ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని, మంచి నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాల కారణంతో పంట నష్టం జరిగినట్లయితే వివరాలను సేకరించాలని సూచించారు. అంతకు మునుపు గ్రామ పంచాయతీ పరిపాలనపై వార్డు సభ్యలు, ఉప సర్పంచ్‌లకు అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

తుపాను ప్రభావంతో పంట నష్టం వాటిల్లకుండా రైతులు జాగ్రత్త చర్యలు పాటించాలని కేవీకే కో-ఆర్డినేటర్ మంజుల సూచించారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురవనున్న నేపథ్యంలో వర్షం నిలిచేంత వరకు వేరుశనగ పంట కోయరాదన్నారు. పంట పొలాల్లో వర్షం నీరు నిల్వ లేకుండా చూడాలని, వరి పంట కోతదశకు వస్తున్నందున పంట పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు.

రామసముద్రం: ప్రస్తుతం కురుస్తున్న తుపాను వర్షంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ భానుప్రసాద్ సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తుపాను ప్రభావంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చెరువు కట్టల పరిశీలన, తాగునీరు క్లోరినేషన్ , ట్యాంక్ క్లీనింగ్, శానిటేషన్ మెటీరియల్ స్టాక్‌తో పాటు జెసిబి అందుబాటులో ఉండాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అలాగే చెంబకూరు గ్రామం వద్ద ఉన్న చెల్లా చెరువును పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ , వీఆర్‌ఏతో కలసి పరిశీలించారు. జాగ్రత్తలు సూచించారు.

శబరిమలైకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

మదనపల్లె సిటీ: అయ్యప్పమాలాధారుల కోసం శబరిమలైకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఇందు కోసం కొత్త బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ఆర్టీసీలో సుదీర్ఘ అనుభవం, నైపుణ్యం కలిగిన ఇద్దరు డ్రైవర్లుతో ఒత్తిడి లేని సురక్షిత సుఖవంతమైన ప్రయాణం ఉంటుందన్నారు. కర్ణాటక, తలనాడు, కేరళలో ఏ విధమైన ఆర్టీఓ పన్నులు ఉండవన్నారు.శబరిమలై టూరుకు 60 కిలోమీటర్లు తగ్గించి రోజుకు 420 కిలో మీటర్లుగానే లెక్కించబడుతుందన్నారు. బస్సులో వంటమనుషులు, మణికంఠస్వామి, అటెండర్లు 7 మందికి ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. సూపర్ లగ్జరీలో 36 సీట్లు ఉంటాయని కిలో మీటరుకు రూ.57 , అల్ట్రాడీలక్స్‌లో 40 సీట్లు ఉంటాయని కిలో మీటరుకు రూ.61, ఎక్స్‌ప్రెస్‌లో 50 సీట్లు ఉంటాయని కిలోమీటరుకు రూ.62 , పల్లెవెలుగులో సీట్లు 55 ఉంటాయని కిలో మీటరుకు రూ.52 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 7382875034, 9440858510, 7382875460ను సంప్రదించాలన్నారు.

ఘనంగా కరాటే మాస్టర్ల దినోత్సవం

మదనపల్లె సిటీ: స్థానిక యూత్ కరాటే క్లబ్‌లో మంగళవారం అంతర్జాతీయ కరాటే మాస్టర్ల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కరాటేలో ప్రతిభ కనబరిచిన మాస్టర్లు మహేశ్వర్, షేక్ మిస్బా, మహమ్మద్ ఐమాన, మోహిబుల్‌రెహ్మాన్, కాలేషామస్తాన్, మహమ్మద్ ఉమర్,లాస్య, తేజిత్, అఫ్సాత్‌బాషా, తనుష్‌కుమార్‌రెడ్డి, జైత్రమాధవ్‌లను విజయ భారతి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.సేతు సన్మానించారు. కరాటే అభ్యసన ద్వారా మానసిక ఉల్లాసం, శారీక దృఢత్వం తదితర అంశాలపై నేటి యువతకు స్ఫూర్తి కలిగించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కరాటే మాస్టర్లకు చేయూత ఇవ్వాలని కోరారు. అనంతరం అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కరాటే క్లబ్ వ్యవస్థాపకులు ఏఆర్ సురేష్ , కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

పంటల సాగుపై జాగ్రత్తలు అవసరం

పీలేరు రూరల్ : వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంటల రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ రమాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని బోడుమల్లువారిపల్లెలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిపంట వెన్నుదశలో ఉండడంతో గింజపడేదశలో ఉన్నందున మానిపండు తెగులు ఆశించకుండా ప్రోపికెనెజాల్ మందును లీటరు నీటికి ఒక మిల్లీ లీటరు చొప్పున పిచికారి చేయాలన్నారు. వరిగింజ మొలక రాకుండా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. వర్షపునీరు బయటకు వెళ్లడానికి కాలువలు తీయాలన్నారు. రైతు సేవా కేంద్రాలలో ఉలవలు 80 శాతం సబ్సిడీతో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి పల్లవి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆశీర్వాదం

కలకడ : నూతన వధూవరులను పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆశీర్వదించారు. మంగళవారం మండలంలోని కోన గ్రామానికి వెళ్లి మాజీ ఎంపీటీసీ సభ్యరాలు స్వర్ణలత మధుసూదన్‌రెడ్డిల కుమారుడు సాయిచరణ్‌రెడ్డి-సుచిత్ర వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లను అరికట్టాలి

మాజీ సైనికుల సంఘ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు



డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న కంచర్ల శ్రీనివాసులునాయుడు తదితరులు

మదనపల్లె : ఆన్‌లైన్ బెట్టింగులు, జూదంకు అలవాటుపడి యువత విలువైన భవిష్యత్‌ను నాశనం చేసుకోవడమే కాకుండా ఆర్థికంగా నష్టపోయి, ఆత్మహత్యలకు పాల్పడుతూ తల్లిదండ్రులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని మదనపల్లె డివిజన్ మాజీ సైనికసంఘం అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులునాయుడు అన్నారు. మంగళవారం మదనపల్లె డీఎస్పీ డి.కొండయ్యనాయుడిని కలిసి ఆన్‌లైన్ బెట్టింగ్‌ల నిరోధానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని విన్నవించారు. ఈ సందర్భంగా కంచర్ల శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ రెండురోజుల క్రితం తంబళ్లపల్లె నియోజకవర్గంలో విజయదశమి రోజున సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆన్‌లైన్ బెట్టింగ్ భూతానికి బలై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవడం విషాదకరమన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అనే తేడా లేకుండా ఆన్‌లైన్ బెట్టింగ్‌లు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయన్నారు. క్రికెట్, గుర్రపుస్వారీ, పేకాట, ఫుట్‌బాల్ తదితర అన్ని క్రీడల్లోనూ ఆన్‌లైన్ జూదం విస్తరించి యువతను ఆకర్షిస్తోందన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై సైబర్ వ్యవస్థను పటిష్టంగా అమలుచేసి, అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సహాజీవన్‌బాబు, వెంకటస్వామి రమేష్‌నాయుడు, బద్ది, సద్దలచక్రపాణి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో వార్డు సభ్యులు కీలకం



తంబళ్లపల్లె: వార్డు సభ్యులకు సూచనలు ఇస్తున్న డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి

తంబళ్లపల్లె: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులు కీలకంగా వ్యవహరించాలని పంచాయతీరాజ్ డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి కోరారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో వార్డు సభ్యులు, ఉపసర్పంచ్‌ల రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించడం, విద్య, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి చొరవ చూపాలన్నారు. పంచాయతీల ఆదాయ వనరులతో గ్రామ పంచాయతీల్లో భాగస్వామ్యం కావాలన్నారు. ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ దిలీప్‌కుమార్, కార్యలయ ఏఓ థామస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ

రామసముద్రం: రామసముద్రం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీఓటీలుగా ఎంపీడీవో భానుప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మహేష్‌లు రిఫ్రెషర్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామసభ, గ్రామ పంచాయతీ సమావేశాలు ప్రాముఖ్యత , ఉపసర్పంచ్‌లు, వార్డ్ మెంబర్ల బాధ్యతలు, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు గురించి వివరించారు.

చిరస్మరణీయుడు అబ్దుల్ కలాం



అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : మిస్సైల్‌మ్యాన్‌గా, భారత రాష్ట్రపతిగా అంతకుమించి గొప్ప వ్యక్తిత్వం ఉన్న మనిషిగా చరిత్రలో చరస్మరణీయుడిగా అబ్దుల్‌కలాం నిలిచిపోయారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా స్థానిక జెడ్పీహైస్కూల్‌లో కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశీలి, రచయిత, మిస్సైల్ మ్యాన్, గొప్పశాస్త్రవేత్త, దేశానికి రాష్ట్రపతిగా సేవలందించిన మహనీయుడు అబ్దుల్‌కలాం అని కొనియాడారు. కలలు కనండి..వాటిని నిజం చేసుకోండి అంటూ యువతకు ఆయన ఇచ్చిన సందేశం మరచిపోలేనిదన్నారు. అబ్దుల్‌కలాంకు పిల్లల మీద ఉన్న ప్రేమను, ప్రోత్సాహాన్ని గుర్తించి ప్రపంచ దేశాలు కలాం జయంతి అక్టోబర్ 15ను ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా నిర్వహిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి, కమ్యూనిటీ చైర్మన్ చంద్రకళ, టీచర్స్ రామచంద్ర, సుధాకరరెడ్డి, ముబారక్‌బాషా, అన్సర్‌బాషా, సుధాకర్‌నాయుడు, బావాజాన్, నాగరాజనాయక్, టీడీపీ నాయకులు రామకృష్ణ ఆచారి, ఎస్.ఎం.రఫీ పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై అవగాహన

వాల్మీకిపురం: గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరులను సమకూర్చి పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపేందుకు ఆయా పంచాయతీ ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు కృషి చేయాలని ఎంపీడీఓ మనోహర రాజు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో మండలంలోని ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రిఫ్రెషర్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఆస్తుల పరిరక్షణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, గ్రామ పంచాయతీ సొంత ఆదాయ వనరులు, విధుల బాధ్యతలు, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి సుధాకర్ రెడ్డి, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు యువకులపై మూకుమ్మడి దాడి

మదనపల్లె: ఇద్దరు యువకులపై మరో వర్గం యువకులు దాడికి పాల్పడ్డారు. జోరు వానలో సైతం సోమవారం రాత్రి పట్టణంలోని మల్లికార్జున సర్కిల్లో యువకుల గుంపు హల్ చల్ చేశారు. రాత్రి 9:30 గంటల సమయం... ప్రజలందరూ చూస్తుండగానే నడిరోడ్డుపై హోటల్ ముందు ఆరుగురికి పైగా యువకులు గుంపుగా వచ్చి, అక్కడే ఉన్న మరో ఇద్దరు యువకులపై దాడికి తెగబడ్డారు. విచక్షణ రహితంగా ముష్టి ఘాతాలు కురిపించారు. కాళ్లతో తన్నుతూ, కింద పడవేసి విచక్షణారహితంగా కొట్టారు. మరో యువకుడు ఏకంగా బండరాయి తీసుకొచ్చి మీద వేయబోయాడు. ఈతతంగాన్ని గమనించిన స్థానికులు టూ టౌన్ ఎస్ఐ రహీముల్లాకు ఫోన్ చేసి సమాచారం అందించారు. ద్విచక్ర వాహనం కుదువ పెట్టిన విషయమై ఇరు వర్గాల మధ్య గొడవ చెలరేగి దాడికి దారి తీసినట్లు తెలుస్తోంది. సంఘటనా స్థలం వన్ టౌన్ పరిధిలోఉండడంతో, అదుపులోకి తీసుకున్న యువకులను స్టేషన్‌కు తరలించారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని వన్ టౌన్ సీఐ చాంద్ బాషా తెలిపారు.